8 లో..

# బాలల సంక్షేమ సమితిలో ఊసరవెల్లులు

ప్రభుత్వ ఆదాయానికి రూ.25 లక్షల గండి

ఒకవైపు విజిలెన్స్ విచారణ
మరొకవైపు శాఖాపరమైన విచారణ


వరంగల్ వాయిస్
Evening Daily
www.warangalvoice.net
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 364 మంగళవారం | 03 సెప్టెంబర్ 2024 | పేజీలు : 08 | వెల రూ. 5


వివరాలు 2లో..

# ఆక్రమణల వల్లే వరదలు





- రాష్ట్ర వ్యాప్తంగా హైడ్రా తరహా వ్యవస్థ
- భారీ వర్షాలతో కనీ, వినీ ఎరుగని నష్టం
- అప్రమత్తంగా వ్యవహరించిన అధికారులు
- చెరువులు, కుంటల ఆక్రమణ వివరాలు సిద్ధం చేయండి
- కలెక్టర్లను ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి

గతంలో ఎన్నడూ లేని విధంగా ఉపద్రవం సంభవించింది.. దీనికి చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణలే ప్రధాన కారణం.. గత పాలకుల స్వార్థ బుద్ధితోనే ఇదంతా జరిగింది.. చెరువులు, నాలాల ఆక్రమణలను ఉపేక్షించేది లేదు.. కబ్జాలు చేసేవారు ఎంతటివారైనా వదిలేదిలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా హైడ్రా తరహా వ్యవస్థ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. చెరువులు, కుంటల ఆక్రమణ వివరాలు సిద్ధం చేయాలంటూ కలెక్టర్లను ఆదేశించారు. వరద ప్రాంతాల పరిశీలనలో భాగంగా మంగళవారం ఉదయం ఖమ్మం నుంచి బయలుదేరిన ముఖ్యమంత్రి డోర్నకల్ నియోజకవర్గం సీరోల్ మండలంలోని పురుషోత్తమయ గూడెం సమీపంలోని 375 ప్రధాన రహదారిలో ఆకేరు వాగు సృష్టించిన బీభత్సంతోపాటు యువ శాస్త్రవేత్త అశ్విని, ఆమె తండ్రి మోతీలాల్ పయనిస్తున్న కారు కొట్టుకుపోయిన ప్రదేశాన్ని పరిశీలించారు. వారి ఇంటికి చేరుకొని నివాళులర్పించారు. అనంతరం మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో మంత్రులతో కలిసి అధికారులతో వరదలపై రివ్యూ చేశారు. బాధితులకు తక్షణ సహాయం అందించాలని ఆదేశించారు. - వరంగల్ వాయిస్, మహబూబాబాద్/డోర్నకల్



8లో..

## శభాష్ డోర్నకల్

- డెకైట్స్ కాదు.. ధర్మాత్ములు
- రైల్వే ప్రయాణికులను ఆదుకుంటున్న డోర్నకల్ ప్రజలు
- 'రెడ్ మార్క్' తొలిగించాలంటూ వేడుకోలు

## మట్టి విగ్రహాలను పూజిద్దాం..

ప్రకృతిని కాపాడుదాం..

పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా



2లో



## వెల్ డన్ సింధూ..

రాష్ట్రంలో వరద బాధితుల సహాయార్థం తన కిట్టీ బ్యాంక్‌లో దాచుకున్న రూ. 3వేలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు మహబూబాబాద్ జిల్లాకు చెందిన పదో తరగతి విద్యార్థిని ముత్యాల సాయి సింధు. మహబూబాబాద్ కలెక్టరేట్ లో మంత్రులు, అధికారులతో సీఎం రివ్యూ సమావేశం నిర్వహించిన అనంతరం ఆయనను కలిసిన సాయి సింధు ఈ మేరకు తన సాయాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేశారు. దీంతో వెల్ డన్ సింధూ అంటూ సీఎం ప్రత్యేకంగా అభినందించారు. -వరంగల్ వాయిస్, మహబూబాబాద్

# ఆక్రమణల వల్లే వరదలు




**రాష్ట్ర వ్యాప్తంగా హైడ్రా తరహా వ్యవస్థ**

**భారీ వర్షాలతో కనీ, వినీ ఎరుగని నష్టం**

**అప్రమత్తంగా వ్యవహరించిన అధికారులు**

**చెరువులు, కుంటల ఆక్రమణ వివరాలు సిద్ధం చేయండి**

**కలెక్టర్లను ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి**

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్/డోర్నకల్ :** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చెరువులు, నాలాల ఆక్రమణతోనే ప్రకృతి వైపరీత్యాలు జరుగుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ లో మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి జిల్లాలో సంభవించిన వరదలపై సీఎం రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరువులు, నాలాల ఆక్రమణలను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. చెరువులపై స్పెషల్ డ్రైవ్ చేపడతామన్నారు. హైడ్రా తరహా వ్యవస్థను రాష్ట్ర వ్యాప్తంగా లన్ని జిల్లాలకు కూడా విస్తరిస్తామన్నారు. ఎంతటి వారైనా ఆక్రమణలకు ఫుల్‌స్టాప్ పెట్టాల్సిందే అంటూ హుకుం జారీ చేశారు. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా హైడ్రా ముందుకు వెళ్తుందన్నారు. కోర్టు అనుమతితోనే ఆక్రమణలను తొలగిస్తామన్నారు. ఆకేరు వాగు వరద బారిన పడుతున్న మరిపెడ మండలంలోని మూడు తండాలను సురక్షిత ప్రాంతానికి తరలిస్తామన్నారు. కేంద్రం వెంటనే జాతీయ విపత్తుగా ప్రకటించాలని ఆయన కోరారు. విష జ్వరాలు ప్రబలి అంటురోగాలు పెరిగే అవకాశం ఉన్నందున మెడికల్ బృందాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బురద కడగడానికి వీలైనన్ని నీళ్ల ట్యాంకర్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వ యంత్రాంగమంతా సమన్వయం చేసుకోవాలని సూచించారు. అవసరమైతే ఇతర జిల్లాల పోలీసులు, అధికారుల సాయం తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు వరద బాధితులకు సాయం చేసేందుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

## అప్రమత్తంగా అధికారులు..

గతంలో ఎన్నడూ కని, వినీ ఎరుగని రీతిలో భారీ వర్షం కురిసినప్పటికీ అధికార యంత్రాంగం అప్పమత్తంగా వ్యవహరించడంతోనే భారీ నష్టం తప్పిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 28 సెంటిమీటర్ల వర్షంపాతం నమోదైందని ఆయన గుర్తు చేశారు. జిల్లా వ్యాప్తంగా వరదలతో నలుగురు మృతి చెందడం బాధాకరం అన్నారు. వారిలో ఇద్దరు స్థానికులు కాగా మరో ఇద్దరు ఖమ్మంకు చెందినవారన్నారు.

## 30 వేల ఎకరాల్లో పంట నష్టం..

మహబూబాబాద్ జిల్లాలో సుమారు 30 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. వరందలతో ఎంతో మంది గూడుకు కోల్పోయారన్నారు. దీంతో 680 మందిని పునరావాసం కల్పించామన్నారు. వరదలతో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. పంట నష్టం జరిగిన ప్రతి ఎకరానికి రూ.10వేల సాయం చెల్లిస్తామన్నారు.

## నివేదిక సిద్ధం చేయాలి..

జిల్లాల్లో చెరువులు, కుంటలు, నాలాల కబ్జాలపై నివేదిక సిద్ధం చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైడ్రా తరహా వ్యవస్థలను జిల్లాల్లో ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. చెరువులను కబ్జాలు చేయడం దారుణమైన నేరమన్నారు. ప్రకృతి మీద మనం దాడి చేస్తే..అది మన మీద దాడి చేస్తుందని హెచ్చరించారు. చెరువులు, కుంటలు కబ్జాపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆక్రమణలకు సహకరించిన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. కబ్జాలకు పాల్పడింది ఎంతటి వాళ్లైనా వదిలిపెట్టవద్దని, కోర్టుల నుంచి అనుమతులు తీసుకుని ఆక్రమణలను తొలగించాలని సీఎం ఆదేశించారు.

## పదేళ్లలో ఒక్కనాడైనా..

రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకుడు ఉన్నాడా అంటూ రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు వరదలు వస్తే ఏనాడు బాధితులను పరామర్శించలేని నాయకుడు, ఇప్పుడు ఇంత ఉపద్రవం జరిగినా ఫామ్ హౌజ్ కే పరిమితం కావడం దురదృష్టకరమన్నారు. ఆయన కుమారుడు అమెరికాలో జల్సాలు చేస్తూ ఎక్స్ వేదికగా ప్రజలతో మమేకమవుతున్న మంత్రులపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. అధికారులు, మంత్రులు నాలుగు రోజులుగా వరద సహాయక చర్యల్లో పాల్గొంటున్నారని పేర్కొంన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో రెవెన్యూ మంత్రి శ్రీనివాస్ రెడ్డి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ప్రభుత్వ విఫ్ రాంచంద్రు నాయక్, ఎమ్మెల్యేలు మురళి నాయక్, కీర్తి రెడ్డి, ఎంపీ బలరాం నాయక్, నూకల నరేష్ రెడ్డి వివిధ శాఖల అధికారుల పాల్గొన్నారు.













# మట్టి విగ్రహాలను పూజిద్దాం..

**ప్రకృతిని కాపాడుదాం..**

**పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వినాయక చవితికి ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను ప్రతిష్టించి పూజించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలసి వినాయక చవితి పండుగను పురస్కరించుకొని పర్యావరణంపై అవగహన కల్పించేందుకు మట్టి గణేష్ విగ్రహాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణానికి అనుకూలమైన మట్టి విగ్రహాలను ఎర్పాటు చేసుకొని పర్యావరణాన్నీ కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. విగ్రహాల తయారీలో కృత్రిమ రంగులు, రసాయనాల వినియోగం వల్ల జల వనరులు కాలుష్యానికి గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాలలో భాగాంగ 8 అంగుళాల మట్టి గణపతులను అందించి పర్యావరణంపై అహగహన కార్యక్రమాలను తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి వారిచే నిర్వహంచడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రతి జిల్లాకు రెండు వేల మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మట్టి విగ్రహాలను పూజించి చెరువులను కలుషితం కాకుండా కాపాడుకోవాలని సూచించారు. అవగాహన కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పర్యావరణ గణేష్ పోస్టర్ల ప్రదర్శన ద్వారా పర్యావరణ సందేశంతో ప్రదర్శన, ప్రచార కార్యక్రమాలు చేపట్టేందుకు కాలుష్య నియంత్రణ మండలి సిద్ధమౌతుందన్నారు. చెరువుల్లో మట్టి మేటలను తొలిగించటానికి, చెరువులో స్వచ్ఛత కాపాడటానికి వినాయక చవితి సందర్భంగా ప్రజలు భక్తులు నడుము బిగించాలాని, మట్టితో వినాయక విగ్రహాలు తయారు చేసి భక్తితో చెరువులోకి చేర్చొచ్చని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సునీత, జీడబ్ల్యూఎంసీ ఆదనవు కమిషనర్ రాజేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




## పునరావాస కేంద్రాల్లో కలెక్టర్ తనిఖీ..

భారీ వర్షాల నేపథ్యంలో పోతన రోడ్ లోని మార్వాడి మందిర్ తో పాటు కరీమాబాద్ ప్రభుత్వ పాఠశాలలో ఆశ్రయం పొందుతున్న ముంపు బాదితులను కలెక్టర్ మంగళవారం క్షేత్ర స్థాయిలో పర్యటించి వారితో మాట్లాడి ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. వరద నీరు తగ్గే వరకు ఈ కేంద్రాల్లో ఉండాలని సూచించారు. సౌకర్యాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బల్దియా సీఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, తహసీల్దార్లు ఇక్బాల్, నాగేశ్వర్ రావు పాల్గొన్నారు

## పింగిళి కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల పరామర్శ



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన పింగిలి జగన్మోహన్ రెడ్డి ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న కమలాపూర్ మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు పింగిలి జగన్మోహన్ రెడ్డి కుమారులైన పింగిలి ప్రశాంత్ రెడ్డి, పింగిలి ప్రవీణ్ రెడ్డి, పింగిలి ప్రదీప్ రెడ్డిలను, కుటుంబసభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో నాంపల్లి ప్రభాకర్, వరికోల్ రమేష్ ప్రజాపతి, ఇజ్జగిరి దేవేందర్ ప్రజాపతి, పోతనబోయిన రాజ్ కుమార్ యాదవ్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేత



**వరంగల్ వాయిస్, వరంగల్ :** శివనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం చిరంజీవి కందకట్ల వశిష్ట దత్త రెండవ జన్మదినం పురస్కరించుకొని తాత-నానమ్మ కందకట్ల రాంప్రసాద్-వైదేహి దంపతులు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 170 మందికి రూ.20 వేల విలువ చేసే నోటు పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమం అమెరికాలో ఉన్న వారి తల్లిదండ్రులు కోరిక మేరకు వారి తాత-నానమ్మ నిర్వహించి పిల్లల మధ్యలో వారి మనవడు జన్మదినం జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రాథమిక పాఠశాల శివనగర్ ప్రధానోపాధ్యాయులు పాత విజయకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ పేద, బడుగు,బలహీన వర్గాల పిల్లలైన ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను అభ్యాసన సామాగ్రితో ఆదుకోవడం చాలా సంతోషమని, ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని ఆ చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగా శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ జన్మదినాన్ని పురస్కరించుకొని సేవా కార్యక్రమం చేయాలని ఆలోచన రావడం చాలా సంతోషమని, అది కూడా ప్రభుత్వ విద్యార్థులను ప్రోత్సహించడం శుభకరమైన పరిణామన్నారు. దీన్ని కొనసాగించాలని వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శారదా ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ గుమ్మడవెల్లి సురేష్ మాట్లాడుతూ రాంప్రసాద్ సేవా నిరతిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, సీఆర్పీ రజిని పాల్గొన్నారు.

## వరద బాధితులకు మరుపల్ల రవి పరామర్శ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 40వ డివిజన్ లోని కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పునరావ కేంద్రంలో మంగళవారం వరద బాధితులను కార్పొరేటర్ మరుపల్ల రవి పరామర్శించారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయం అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వరద బాధితులు సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఆనంద్ కుమార్ ఉన్నారు.

# పద్మశాలీలంతా సంఘటితంగా ముందుకెళ్లాలి

### నవీన్ కుటుంబానికి అండగా ఉంటా
### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నిరుపేద పద్మశాలి కుటుంబానికి చెందిన నవీన్ కుటుంబానికి ప్రభుత్వం తరపున అండగా నిలబడతామని, ఇందిరమ్మ ఇల్లు ఇప్పించే బాధ్యత నాదని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హామీ ఇచ్చారు. హనుమకొండ కుమార్ పల్లికి చెందిన నిరుపేద పద్మశాలి కులస్తుడైన నవీన్ భార్య నిఖిత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా సొంత ఇల్లు లేకపోవడంతో కర్మకాండలు శ్మశాన వాటికలోనే ఉంటూ నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న అఖిల భారత పద్మశాలి హనుమకొండ జిల్లా కమిటీ వెంటనే స్పందించి ఆర్థిక సహాయానికి ముందుకు వచ్చింది. రాష్ట్రంలోని పద్మశాలి కులస్తులు తోచిన సహాయం చేయడంతో వచ్చిన లక్షా 60 వేల రూపాయల చెక్కును ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కులస్తులంతా ఒక్కటై తమకు తోచిన విధంగా ఆర్థిక సాయం చేయడం హర్షించదగ్గ విషయమని, మిగతా కులస్తులు ఈ ఆర్థిక సాయాన్ని ఆదర్శంగా తీసుకొని నిరుపేదలకు బాసటగా నిలువాలన్నారు. కుటుంబానికి ప్రభుత్వం తరపున సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు, ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే అభయ హాస్పిటల్ స్పందించి బాధ్యత కుటుంబానికి పదేళ్ల పాటు ఉచిత వైద్య సేవలు అందిస్తామని హామీ ఇచ్చింది. అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్నాల నరేందర్ మాట్లాడుతూ కుల ఐక్యతకు నిదర్శనం ఈ కార్యక్రమం అని, పద్మశాలి కులస్తులంతా నిరుపేదలకు సాయం చేయడానికి ముందుకు రావాలని, మునుముందు కమిటీ తరపున మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి ఉమ్మడి వరంగల్ జిల్లాల సంఘం అధ్యక్షుడు బచ్చు ఆనందం, ఆడెపు రవీందర్, వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి వైద్యం రాజగోపాల్, తవుటం రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు పోరండ్ల రమేష్, వెంగల వేణుగోపాల్, ప్రచార కార్యదర్శి పులికంటి రాజేందర్, కోశాధికారి సత్కూరి సంతోష్ రాజ్, కార్యవర్గ సభ్యుడు వెంగళ బాలకృష్ణ, కుల బాంధవులు పాల్గొన్నారు.

## ఘనంగా ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ 7వ వార్షికోత్సవ వేడుకలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్-తపాలా శాఖ వారి బ్యాంక్ 7వ వార్షికోత్సవ వేడుకలు హనుమకొండ ఐపీపీబీ హెడ్ ఆఫీస్ లో ఘనంగా జరుపుకున్నారు. ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ సెప్టెంబర్ 1, 2018న ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా ఆరంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు దేశ వ్యాప్తంగా రూ.9.88 కోట్ల బ్యాంక్ ఖాతాలు పూర్తిగా కాగిత రహితంగా తెర్వటం జరిగింది. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ పూర్తిగా తపాలా శాఖ నెట్ వర్క్, మానవ వనరుల అంటే పోస్ట్ మెన్ ద్వారా ప్రజలకు సేవలందిస్తోంది. ఈ కార్యక్రమంలో హనుమకొండ సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్సు రమా దేవి, మహబూబాబాద్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్సు మహ్మద్ నయీమొద్దీన్, భూపాలపల్లి సబ్ డివిజన్ హెడ్ ఇన్ స్పెక్టర్ ఆఫ్ పోస్ట్సు రామకృష్ణ, ఐపీపీబీ హనుమకొండ సీనియర్ మేనేజర్ ప్రమోద్, మేనేజర్ ప్రవీణ్, ఐపీపీబీ మహబూబాబాద్ మేనేజర్ సంపత్, హనుమకొండ సబ్ పోస్ట్ మాస్టర్ లింగమూర్తి పాల్గొన్నారు.

## పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

### ఎకరానికి రూ.20వేల నష్టపరిహారం ఇవ్వాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తుఫాను వల్ల పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.20వేలు నష్టపరిహారం ఇవ్వాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ సభ్యులు రాచర్ల బాలరాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత మూడు రోజులుగా పడిన భారీ వర్షానికి ఉమ్మడి జిల్లాలోని మహబూబాబాద్, వరంగల్, ములుగు, భూపాలపల్లి, హనుమకొండ జిల్లాల్లో వరి పత్తి పంటలు దెబ్బతిన్నాయని ఆయన అన్నారు. వర్షం బీభత్సం వల్ల చెరువులు కుంటలు తెగి పంట చేతికొచ్చే సమయంలో నీటిపాలైందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణ సహాయ చర్యలు చేపట్టినప్పటికీ పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేలు ప్రకటించడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. గత మూడు నెలల కాలంలో ఎకరానికి ఇప్పటికే రూ.15 వేలకు పైగా ఖర్చు చేశారని, ఇందులో కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తుఫాను వల్ల ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, అలాగే పశువులు, కోళ్లు కోల్పోయిన వారికి తగిన నష్టపరిహారం ఇవ్వాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే రాష్ట్రంలో తక్షణమే పంటల బీమా పథకాన్ని అమలులోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.

# పీఏసీఎస్‌లో స్పెల్లింగ్ మిస్టేక్స్

### ఆధార్ కాకుండా ఇష్టారాజ్యంగా డాటా ఎంట్రీ
### సిబ్బంది నిర్లక్ష్యంతో రుణమాఫీకి దూరంగా రైతులు
### ఏఓ కార్యాలయం నుంచి బ్యాంకుకు ప్రదక్షిణలు




**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** సిబ్బంది చేసిన నిర్లక్ష్యంతో వందలాది మంది రైతులు రుణమాఫీకి నోచుకోలేదు.. కంప్యూటర్ లో ఆధార్ కార్డు ప్రకారం పేరు, చిరునామా, ఇతర వివరాలు నమోదు చేయడంలో అశ్రద్ధ చేయడంతో ఇప్పుడు 'డాటా నాట్ ఫౌండ్ ' అని వస్తుంది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో అటు మండల వ్యవసాయ శాఖ కార్యాలయానికి, ఇటు రుణం తీసుకున్న బ్యాంకుకు పరుగులు పెడుతున్నారు. రుణమాఫీకి నోచుకోని రైతులు మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం తెలపడంతో వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో తప్పుడు సమాచారం నమోదు చేసినట్లు తెలియవచ్చింది. ఉదాహరణకు ఇస్లావత్ తండాకు చెందిన ఓ రైతు ఇంటి పేరును ఎస్లావత్ గా నమోదు చేశారు. ఆధార్ కార్డు ప్రకారం %జుూూూవాూుఎ% అని ఉంటే %×ంశ్రీఖజుఫ్త్ర% అని కంప్యూటర్ లో నమోదు చేశారు. దీంతో సంబంధిత రైతుల పేర్లు గల్లంతయ్యాయి. 2020-23 మధ్య అనేక మంది రైతులు పర్వతగిరి పీఏసీఎస్ లో రుణం తీసుకున్న ప్రభుత్వం కల్పించిన రుణమాఫీకి అర్హత కోల్పోయారు. అసలు పేరు మంగి అయితే మంగమ్మగా, సునీత అయితే సోనిట(%ంశీఅఱ్ఖ%)గా పేర్లు మార్చడంతో ఇలా ఎంతో మంది రైతులకు రుణమాఫీ వర్తించకుండా పోయింది. అలాగే వ్యవసాయ శాఖ అధికారులు సైతం రైతులకు సరైన సమాచారం ఇవ్వడం లేదని, అధికారులే గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరణ చేస్తారని ప్రభుత్వం ప్రకటించినా అది ఆచరణలో కనబడడం లేదు. విసిగి వేసారిన రైతులు కార్యాలయంలో సంప్రదించగా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నట్లు అన్నదాతలు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆధార్ కార్డు డాటాను పరిగణనలోకి తీసుకుని తప్పుడు వివరాలు నమోదు చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# మట్టి విగ్రహాలను ఏర్పాటు చేద్దాం

## అవగాహన పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్



**వరంగల్ వాయిస్, ములుగు :** వినాయక చవితి సందర్భంగా వినాయక విగ్రహాల తయారీలో కృత్రిమ రంగులు, రసాయనాల వినియోగం వల్ల జల వనరులు కాలుష్యానికి గురవుతున్నాయని, అందుచే కృత్రిమ రంగులు, రసాయనాలతో చేసిన విగ్రహాలను మానివేసి మట్టితో చేసిన విగ్రహాలను పూజించి చెరువులను కలుషితం కాకుండా కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ తన ఛాంబర్ లో అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇంచార్జి సంపత్ రావులతో కలసి వినాయక చవితి పండుగను పురస్కరించుకొని ఈ సంవత్సరం, పర్యావరణంపై అవగహన కల్పించేందుకు, మట్టి గణేష్ విగ్రహాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణానికి అనుకూలమైన మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోని పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాలలో భాగంగా 8 అంగుళాల మట్టి గణపతిలను అందించి పర్యావరణంపై అహగహన కార్యక్రమాలను తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి వారిచే నిర్వహంచడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అవగాహన కార్యక్రమాలలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పర్యావరణ గణేష్ పోస్టర్ల ప్రదర్శన ద్వారా పర్యావరణ సందేశాలతో ప్రదర్శన, ప్రచార కార్యక్రమాలు చేపట్టేందుకు కాలుష్య నియంత్రణ మండలి సిద్ధమౌతుందన్నారు. చెరువుల్లో మట్టి మేటలని తొలిగించటానికి చెరువులో స్వచ్ఛత కాపాడటానికి వినాయక చవితి సందర్భంగా ప్రజలు భక్తులు నడుము బిగించాలన్నారు. మట్టితో వినాయక విగ్రహాలు తయారు చేసి భక్తితో చెరువులోకి చేర్చొచ్చని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోరారు. అలాగే తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రతి జిల్లాకు 2000 వేల మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కాబట్టి మట్టి విగ్రహాలను పూజించి చెరువులను కలుషితం కాకుండా కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారి ఎం.సుభాష్ నాయక్, కలెక్టరేట్ కార్యాలయ ఏ.ఓ. రాజ్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, డీపీఆర్ఓ రఫిక్ పాల్గొన్నారు.

## ఉధృతంగా ప్రవహిస్తున్న మానేరు



**వరంగల్ వాయిస్, మల్హర్ :** గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో పాటు, ఎగువ నుంచి భారీ వరద రావడంతో మండలంలోని కొయ్యూరు సమీపంలోని మానేరు నది ఉధృతంగా ప్రవహిస్తుంది. మానేరు ఉధృతికి మండలంలోని కొయ్యూరు, వల్లెంకుంట, కుంభం పల్లి గ్రామాల రైతుల మోటార్లు, స్టార్టర్లు, పైపులు కొట్టుకు పోవడంతో రైతులకు భారీ స్థాయిలో నష్టం వాటిల్లింది. మరో వైపు శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు, శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నుంచి గోదావరిలోకి భారీ వరద రావడంతో మానేరు పరివాహక ప్రాంత ప్రజలు, రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మేడిగడ్డ లక్ష్మి బ్యారేజిలో 85 గేట్లు, సరస్వతి బ్యారేజి 66 గేట్లు ఓపెన్ చేసి ఉండటంతో వచ్చిన నీరు వచ్చినట్టు కిందికి వెళ్లిపోతుంది.

## మట్టి వినాయక ప్రతిమలనే ప్రతిష్ఠిద్దాం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వినాయక చవితి పర్వదినాన ప్రతి ఒక్కరు విధిగా తమ ఇళ్లలో మట్టి వినాయక ప్రతిమలను ప్రతిష్టించి పూజించాలని ప్రముఖ సామాజికవేత్త, పర్యావరణ ప్రేమికులు నిమ్మల శ్రీనివాస్ అన్నారు. హనుమకొండలోని సెయింట్ పీటర్స్ పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను మంచినీటిలో నిమజ్జనం చేయడం వల్ల అందులో ఉన్న విషపూరిత రంగుల వలన పర్యావరణానికి మేలు చేసే బ్యాక్టీరియా నశించి హాని కలుగుతుందని ఆయన అన్నారు. పాఠశాల కరస్పాండెంట్ గోపు జైపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులంతా విధిగా పర్యావరణానికి మేలు చేసే మట్టితో తయారు చేసిన విగ్రహాలనే ప్రతిష్టించి పూజించాలని విద్యార్థులను కోరారు. నాలుగు రోజుల పాటు నగరంలోని వివిధ పాఠశాలలో ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శ్రీనివాస్ తెలిపారు. అందమైన ఆకర్షణీయమైన మట్టి గణపతి ప్రతిమల సమాచారానికై తన చరవాణి నెంబర్ 99497 09866 సంప్రదించవచ్చునని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరిబాబు, వినీత తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులచే పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు.

## బీసీ కులగణన చేపట్టి తీరాల్సిందే

### పులి రజనీకాంత్ ముదిరాజ్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాంగ్రెస్ ప్రకటించిన కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రజక పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపపర్తి కుమార్ గాడ్గే చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షకు బీఆర్ఎస్ నాయకులు మద్దతు ప్రకటించారు. బాలసముద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ సార్ స్మృతి వనం బస్టాండ్ వద్ద దీక్ష చేస్తున్న కుమార్ కు బీఆర్ఎస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజనీకాంత్ ముదిరాజ్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పులి రజనీకాంత్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో తప్పకుండా 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోపే బీసీల కుల గణన చేపట్టాలని కోరారు. బడ్జెట్లో 20000 కోట్లు కేటాయించకపోవడం బీసీలకు అన్యాయం చేయడమే అన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ సైతం బీసీలకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం సైతం బీసీలకు 10 లక్షల కోట్లు బడ్జెట్ లో కేటాయించాలని డిమాండ్ చేశారు. విద్య, రాజకీయ, ఉద్యోగ రంగాల్లో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కుసుమ లక్ష్మీ నారాయణ, సాయిని రాజేందర్, క్రాంతికుమార్, సురేష్, నాయకులు జానకిరాములు, శ్రీనివాస్, రమేష్ చారి, మహేష్, భీమ్ రాజు, రాజు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్లిన కార్యదర్శికి సన్మానం



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని వల్లెంకుంట గ్రామంలో గత 5 ఐదు సంవత్సరాలుగా పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించి ఇటీవల బదిలీపై రేగొండకు వెళ్లిన కర్ణకంటి నరేష్ ను వల్లెం కుంట గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించారు. కొయ్యూరు, వల్లెంకుంట గ్రామాల రెడ్డి గాండ్ల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి హాజరు కాగా, తాజా మాజీ ఎంపీపీ చింతలపల్లి మల్హల్ రావు, మాజీ జడ్పీటీసీ అయిత కోమల రాజిరెడ్డితో పాటు గ్రామంలోని వివిధ కుల సంఘాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పోషణ లోపం లేకుండా చూడాలి

### ఎంపీడీవో ఫణిచందర్



**వరంగల్ వాయిస్, శాయంపేట :** బాల బాలికలకు, మహిళలకు పోషణ లోపం నుండి చేస్తూ ఆరోగ్యవంతులుగా చేయాలని ఎంపీడీవో ఫణి చందర్ అన్నారు. మండలంలోని కొత్తగా సింగారం గ్రామంలోని జిపి కార్యాలయాల ఆవరణలో మంగళవారం అంగన్వాడి టీచర్లు పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో పని చందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో మహిళలు, బాల బాలికలు పోషణ లోపం లేకుండా చూడాలని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గ్రామస్తులతో కలిసి అంగన్వాడి టీచర్లు ఇంటింటా పోషణ సంబరం జరుపుకున్నారు. అంగన్వాడీ టీచర్లు రేవతి, మధుర, సరిత, కారోబార్ రాజు, జిపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అలకనందకు నాట్య కళాజ్యోతి అవార్డు




**వరంగల్ వాయిస్, ఖమ్మం :** నాగశ్రీ సాంస్కృతిక శాఖ స్వర్ణ మధురిమ కల్చరల్ ఖమ్మం ఆధ్వర్యంలో శనివారం జరిగిన సుధీర్ఘ గానలాహరి సంగీత సాంస్కృతిక కార్యక్రమంలో వర్ధమాన నృత్య కళాకారిణి కుమారి బానోత్ అలకనంద్ రాథోడ్ తనదైన శైలిలో నృత్య ప్రదర్శనలను ప్రదర్శించి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జీనియస్ ఇండియా బుక్ అఫ్ రికార్డ్ బింగి నరేందర్ గౌడ్, ముకుంద చారిట్రబుల్ ట్రస్ట్ చైర్మన్ ఖమ్మం చెరుకూరి రాజి, డా ఎస్వీఆర్ వెంకటేష్, కవి,గాయకులు కరీంనగర్ చేతుల మీదుగా నాట్య కళాజ్యోతి అవార్డుని అందుకున్నారు. ముఖ్య అతిథి మాట్లాడుతూ చిన్న వయసులో ఎంతో అద్భుతమైన నృత్య ప్రదర్శనలను ఇవ్వడం ఎంతో గొప్ప విషయమని అలకనందను అభినందించారు. ఈ కార్యక్రమంలో కవులు, గాయకులు, స్వర మధురిమ అధ్యక్షులు ఇసనపల్లి నగేష్, ప్రముఖ న్యాయవాది జిల్లా లక్ష్మినారాయణ, మ్యూజిక్ డైరెక్టర్ మాధవరావు, వీవీ రెడ్డి, మన్నెపల్లి మల్లికార్జున్, తల్లిదండ్రులు బానోత్ దివ్య–రాజ్ కుమార్ పాల్గొన్నారు.

## భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్



**వరంగల్ వాయిస్, ములుగు :** భారీ వర్షాల దృష్ట్యా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ అన్నారు. మంత్రి డాక్టర్ సీతక్క ఎప్పటికప్పుడు జిల్లా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నారని తెలిపారు. సోషల్ మీడియా లో తప్పుడు ప్రచారాలు చేసిన వారి పై చర్యలు ఉంటాయని, మీకు చేతైనతే సాయం చెయ్యండి విమర్శలు చేయడం కాదన్నారు. సోషల్ మీడియాలో బతుకుతున్న బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేయడం మానుకొని ప్రజా క్షేత్రంలో ఉండి ప్రజలకు సేవ చేయాలని సలహ ఇచ్చారు. సోషల్ మీడియాలో కారు కూతలు కూయడం కాదని, గత ఏళ్లలో మీరు చేసింది ఏంటో ప్రజలకు తెలుసన్నారు. మేము అధికారంలో ఉన్న ప్రతిపక్షంలో ఉన్న ఎప్పుడు ప్రజల పక్షమేనన్నారు. ఇంట్లో కూర్చొని రాళ్లు వేయడం మాని, బయటకు వచ్చి ప్రజలకు సేవ చేయాలని హితవు పలికారు. ములుగు కలెక్టర్ నిరంతరం అన్ని శాఖలతో సమన్వయం చేస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారన్నారు. భారీ వర్షాల మూలాన రహదారిపై వందలాది చెట్లు రోడ్ల మీద పడితే జిల్లా ఎస్పీ చొరవతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా తొలగించడం జరిగింది. మంత్రి సీతక్క చొరవతో లోలెవల్ బ్రిడ్జిలు ఉన్న చోట హై లెవల్ బ్రిడ్జి నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని, త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం పనులు చేపడుతుందని తెలిపారు. – భారీ వర్షాల కారణంగా దెబ్బ తిన్న పంటలకు నష్ట పరిహారం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. ఇళ్ళు కూలిపోయిన వారికి తక్షణ సాయంతో పాటు రూ. 5 లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇచ్చే భాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. ఇంకా రెండు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కాబట్టి, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దయచేసి మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని, వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయని, ఆత్యవసం ఉంటే తప్ప ప్రజలు ఎవ్వరూ బయటకు రావద్దని పిలుపునిచ్చారు. శిధిలావస్థలో ఉన్న ఇళ్లను ఖాళీ చేయాలని, జిల్లా వ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సహాయక చర్యల్లో పాల్గొనాలని, అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# పారా ఒలంపిక్స్‌లో ఫైనల్‌కు చేరిన దీప్తి

## అభినందించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఉమ్మడి వరంగల్ జిల్లా నిరుపేద కుటుంబానికి చెందిన జీవంజి దీప్తి ఇటీవల జరిగిన పారా అథ్లెటిక్స్ టీ-20 ఉమెన్స్ 400మీటర్ల పందెంలో కేవలం 55.7సెకన్లలో గోల్డ్ మెడల్ సాధించి, 2024 పారాలంపిక్స్ లో ఫైనల్ చేరుకోవడం పట్ల వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఫైనల్ కు చేరుకున్న దీప్తి బంగారు పథకం సాధించి వరంగల్ జిల్లా కీర్తి ప్రతిష్టలు మరింత పెంచాలని కోరుకున్నారు. దీప్తి కుటుంబానికి ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని, మరింత ప్రోత్సాహకం అందిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# సీరోల్ ఎస్సై నగేష్‌ను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి



**వరంగల్ వాయిస్, మరిపెడ :** భారీ వర్షం ధాటికి మరిపెడ మండలంలోని సీతారాం తండాను వరద ముంచెత్తింది. దీంతో సమాచారం అందుకున్న సీరోల్ ఎస్సై నగేష్ నగేష్ తన సిబ్బందితో వెళ్లి ప్రజలను ఎత్తైన ప్రదేశంలోకి తరలించడంతో పాటు ఓ వృద్ధురాలిని స్వయంగా ఎస్సై నగేష్ జోలె కట్టి ఎత్తుకొని వెళ్లారు. ఈ క్రమంలో ఎస్సై చూపిన ప్రతిభ, ధైర్య సాహసాలకు ఎస్సై నగేష్ ను సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు.

# వరద బాధితులకు ఆహారం అందజేత



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల రావిరాల గ్రామంలో చెరువు తెగి ఇండ్లలోకి వర్షపు నీరు చెరువు నీరు చేరింది. అకాల వర్షాలతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతుంటే వారికి ఎదల్ల యాదవ రెడ్డి మంగళవారం భోజన వసతి ఏర్పాటు చేశారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండపల్లి కృష్ణ, సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు, ఈ ఆహార పంపిణీ కార్యక్రమంలో పాల్గొని, విపత్తులో ప్రజలకు అండగా ఉండాలని సూచించారు. భోజనం ఏర్పాటు చేసినందుకు ఎదల్ల యాదవ రెడ్డికి రావిరాల గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# భవిష్యత్తు తరం ఉద్యోగాలపై సదస్సు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ బొల్లికుంట వరంగల్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం భవిష్యత్తు తరంలో రాబోయే ఉద్యోగాలపై సదస్సును నిర్వహించారు. భౌగోళిక ప్రాంతాలలో టైర్-2,3 పట్టణాల్లో భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న రాబోయే ఉద్యోగాలను రూపొందించడానికి 140 గంటల శిక్షణ శిబిరాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ప్రకాశ్ మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యశాలలో "ఎంఈఆర్ఎన్ స్టాక్‌తో ఆధునిక వెబ్ అప్లికేషన్లను రూపొందించడం"డొమైన్‌లో ఐఆర్ 4.0 నైపుణ్యాలను అందించడం ఈ ప్రోగ్రామ్ లక్ష్యం. ప్రీ-ఫైనల్, చివరి సంవత్సరం నుంచి ఇంజినీరింగ్, నాన్-ఇంజినీరింగ్ కోర్సుల విద్యార్థులకు 140 గంటల శిక్షణ విద్యార్థుల భవిష్యత్తు ఉద్యోగావకాశాలను పెంపొందిస్తుందని తెలిపారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు తర్వాత ఉచిత ధృవీకరణ పత్రాలు అందచేయనున్నారు. ఏఐసీటీఈ-ఈవై జీడీఎస్ వారు ఆమోదించిన సిలబస్ ప్రకారం ఇంటర్న్‌షిప్, ప్రాజెక్ట్ వర్క్స్ చేయించుటకు ఎడ్యునెట్ ట్రైనర్లు హరి కృష్ణ, శివ మోహన్ బాబు, అజయ్ రెడ్డిలు కంప్యూటర్ సైన్స్ , మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ 500 విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఇండస్ట్రీ ఎక్స్‌పర్ట్ టాక్లె ర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఎల్ ఎంఎస్) ద్వారా ప్రాంగణ నియామకాలు చేపడతామన్నారు. సాంకేతిక శిక్షణ 70 గంటలు, ఉపాధి నైపుణ్యాలు 20 గంటలు, నిపుణుల చర్చలు 10 గంటలు, ఏఐసీటీఈ-ఈవై జీడీఎస్ ఇంటర్న్‌షిప్ 40 గంటలు, మొత్తం వ్యవధి 140 గంటలు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సదస్సుకు వివిధ విభాగాధిపతులు డాక్టర్ సత్యవతి, డాక్టర్ తన్వీర్ జహాన్, డాక్టర్ ఆయేషా భాను, కోఆర్డినేటర్లు బర్కత్, శేఖర్లు పాల్గొన్నారు.

# శాస్త్రీయ విద్య సాధనే ధ్యేయంగా విద్యార్థి ఉద్యమాలు

## పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు




**వరంగల్ వాయిస్, వరంగల్ :** విప్లవ విద్యార్థి అమరవీరుల పోరాట స్ఫూర్తితో శాస్త్రీయ విద్యా సాధనే ధ్యేయంగా విద్యార్థి ఉద్యమాలను ఉధృతం చేయాలని పీడీఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండలోని అశోక సెంటర్ లో పీడీఎస్ యూ 50వ వార్షికోత్సవ సభలను అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో విస్తృతంగా నిర్వహించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ ముద్రించిన వాల్ పోస్టర్స్ ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా బి.నరసింహారావు మాట్లాడుతూ భారత విప్లవ విద్యార్థి ఉద్యమ చరిత్రలో పీడీఎస్ యూ ప్రత్యేక చరిత్ర కలిగి ఉన్నదని, జార్జి రెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, కోలాశంకర్, దుస్సా చేరాలు, బొమ్మ సాంబయ్య, రంగవల్లి, మారోజు వీరన్న లాంటి ఎందరో వీరులు విద్యార్థుల హక్కులు, శాస్త్రీయ విద్య, సమ సమాజ స్థాపన కోసం పోరాడుతూ అమరులయ్యారని గుర్తు చేశారు. 78 సంవత్సరాల స్వాతంత్ర భారత దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, మైనారిటీ ,తాడిత, పీడిత వర్గాలకు ఉచిత నాణ్యమైన విద్య, వైద్యం అందించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో, దేశంలో ప్రభుత్వాలు విద్యారంగ బాధ్యత నుంచి క్రమంగా తప్పుకోవడంతో విద్యారంగం పూర్తిగా ప్రైవేట్, కార్పొరేట్ పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్లి వ్యాపారమయం అయ్యిందని, పేద వర్గాలకు విద్యారంగం అందని ద్రాక్షల పాలకులు మార్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకులు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున విద్యార్థి ఉద్యమాలను ఉధృతం చేయాలని విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. అక్టోబర్ 12, 13 తేదీల నాటికి పీడీఎస్ యూ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో సభలు, సమావేశాలు, గ్రూప్ మీటింగ్స్ విస్తృతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ గ్రేటర్ వరంగల్ నగర కమిటీ నాయకులు రవి, అభిషేక్, అఖిల్, కె.కళ్యాణ్, వర్షిత్, కే.కేశవ్, బి.రాజ్ కుమార్, చరణ్, సయ్యద్, అజహార్ పాల్గొన్నారు.

# కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి




## ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేదాసి మోహన్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచి స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేదాసి మోహన్ డిమాండ్ చేశారు. బీసీ డిక్లరేషన్ అమలు కోసం ఏకశిలా పార్కు వద్ద గత పది రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గేకు ఆయన మంగళవారం మద్దతు తెలిపి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల కోసం చాపర్తి కుమార్ గాడ్గే చేస్తున్న పోరాటం చారిత్రాత్మకమైనదని కొనియాడారు. పది రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేయడం వలన ఆయన ఆరోగ్యం క్షీణించిందని వెంటనే ప్రభుత్వం స్పందించి స్పష్టమైన ప్రకటన చేసి దీక్షను విరమింపచేయాలని కోరారు. లేనిపక్షంలో బీసీల తరఫున పోరాటం చేస్తామని తెలిపారు. వివిధ ప్రజాసంఘాల నాయకులు సాయిని నరేందర్, కలకోటి మహేందర్, మాదాసి సురేష్, తాడిశెట్టి క్రాంతి కుమార్, పటేల్ వనజ, కూనూరు రంజిత్ గౌడ్ పాల్గొన్నారు.

# వరద బాధితులను అన్ని విధాల ఆదుకోవాలి

## తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారీ వర్షాలు వరదల బీభత్సంతో కష్టాల పాలైన వారందరిని అన్ని విధాల ఆదుకోవాలని బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల వలన లోతట్టు ప్రాంతాలకు నీరు వచ్చి పలు కాలనీలు, గ్రామాలు జలమయ్యాయని, అనేక ఇండ్లు కూలిపోయి సర్వస్వం కోల్పోయిన వారి బాధలు వర్ణనాతీతమన్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని శ్రమజీవులు అయినా వ్యవసాయ కూలీలు, చేనేత తదితర చేతి వృత్తుల వారు, భవన నిర్మాణ కార్మికులు, చిరు వ్యాపారులు మొదలైన వారంతా పనులు లేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విపత్కర పరిస్థితిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణలో వరదల బీభత్సాన్ని కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించి తక్షణ సహాయంగా రూ. రెండు వేల కోట్లు అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణ సహాయంగా ప్రతి బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం, రూ.25వేల ఆర్థిక సహాయం అందించాలన్నారు. దెబ్బతిన్న పంట పొలాలను సర్వే చేసి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, ఇండ్లు కోల్పోయిన వారికి ఇల్లు నిర్మించాలని, భారీ వర్షాల వలన ప్రమాదాలకు గురై చనిపోయిన కుటుంబాల వారికి రూ.20 లక్షలు ఎక్స్ గ్రేషియో ఇవ్వాలన్నారు. డ్రైనేజీలు, రోడ్ల మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వరదల నివారణకు శాశ్వత నివారణ చర్యలు చేపట్టేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు జరపాలని వెంకట్రాములు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# మహ్మద్ పాషాకు ఉత్తమ సేవా అవార్డు



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** గణపూర్ మండల కేంద్రానికి చెందిన మహ్మద్ పాషా గత కొన్ని సంవత్సరాలుగా ఎంతో మంది నిరుపేదలకు ఆర్థికంగా, ఆయుర్వేద వైద్యంతో చేస్తున్న సేవలను గుర్తింపుగా ఉత్తమ సేవా అవార్డు వరించింది. కర్నాటక రాష్ట్రం బెంగుళూర్ లోని విజయనగరం శ్రీ ఆది కించినిగిరి మహిళా సంఘం భవనంలో భారత్ సేవా రత్న సమితి ఎస్ కె సాధిక్ ఆధ్వర్యంలో ప్రముఖులు సినీ డైరెక్టర్ గుణవంత మంజు, డీపీ సాయబ్ ఇర్ఫాట్, కర్నాటక రాష్ట్ర కన్నడ భాష అధ్యక్షులు కృష్ణ బైరి గౌడ, సుప్రీం కోర్టు లాయర్ కృష్ణ మూర్తి, అనాథ సేవా ట్రస్టు సేవకులు డాక్టర్ మంజన్న గురువుల చేతుల మీదుగా గత నెల 27న ఉత్తమ సేవా అవార్డు ఆయన అందుకున్నారు. అవార్డు అందుకున్న పాషా మాట్లాడుతూ గురువుల ఆశీస్సులతో రానున్న కాలంలో ఎంతో మంది నిరుపేదలకు సాయాన్ని అందిస్తానని, విద్యలు నేర్పిన గురువుల రుణం తీర్చుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో గుగులోతు సజన్ లాల్, భరత్ కుమార్, మహబూబ్, రాజాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలో గత ఐదు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు మండల కేంద్రంలోని అమ్మాపురం గ్రామ శివారులో గల రైతులకు చెందిన వరి పంట, మొక్కజొన్న పంటలు పూర్తిగా వర్షానికి నష్టపోవడం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ, సీపీఎం, సీఐఎంఎల్ వామపక్ష నాయకులు భారీ వర్షానికి దెబ్బతిన్న పంటలను సందర్శించి తదనంతరం సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిటీ సభ్యుడు తమ్మెర విశ్వేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బొల్లం అశోక్, సీఐఎంఎల్ జిల్లా సహాయ కార్యదర్శి ప్రజాపంథా కొత్తపల్లి రవిలు సంయుక్తంగా మాట్లాడుతూ గత ఐదు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు రైతులు వేసిన పంటలు వర్షానికి దెబ్బతినడం చాలా బాధాకరమన్నారు. ఈ భారీ వర్షంతో రైతులు ఆర్థికంగా చాలా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## ప్రజల అభిప్రాయాలు తీసుకోవాలి



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని కొన్ని గ్రామాలు కుడా పరిధిలోకి, గ్రామ సభలు నిర్వహించి తీర్మానాలు చేసి విలీనం చేసే ప్రక్రియను ప్రతి గ్రామంలో ప్రజల అభిప్రాయం తీసుకొని కుడా అధికారులు విలీనం చేసే గ్రామాలకు సంబంధించి లాభానష్టాలు తెలియజేయాల్సిన అవసరం ఉందని బహుజన సంక్షేమ సంఘం (బీఎస్ఎస్) ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మొగ్గం సుమన్ డిమాండ్ చేశారు. కుడా పరిధిలోకి వెళ్లే గ్రామాల్లో ఉన్న ప్రజలకు (కుడా)అంటే ఏంటో కూడా తెలియదన్నారు. భవిష్యత్తులో కాకతీయ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీలో విలీనం చేయడం మూలంగా ఈ గ్రామాలలో ఉన్న ప్రజలకు ఎలాంటి ఉపయోగాలు ఉంటాయో, ఎలాంటి నష్టాలు ఉంటాయో వివరంగా తెలియజేయాల్సిన అవసరం కుడా అధికారులపై ఉందన్నారు. అదేవిధంగా గ్రామంలో అందరి అభిప్రాయాలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. గతంలో శాయంపేట మండలం నియోజకవర్గంగా ఉండేది, కొంతమంది రాజకీయ నాయకుల స్వార్థం కోసం నియోజకవర్గాన్ని లేకుండా చేశారన్నారు. మండల కేంద్రాన్ని విచ్చిన్నం చేయడం కోసం బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పూనుకున్నారని, ఇలాంటి వ్యవహార శైలి మంచిది కాదని తక్షణమే సంబంధిత గ్రామాలలో ప్రజాభిప్రాయ సేకరణ తీసుకొని దానికి అనుకూలంగా వ్యవహరించాలని తెలిపారు. లేకుంటే ప్రజల పక్షాన ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత మండల నాయకులు మారపల్లి సుధాకర్ (డాన్), నత్తి స్వామి, రమేష్ మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## టీఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన మాజీ ఎంపీపీ చంద్రప్రకాష్



**వరంగల్ వాయిస్, శాయంపేట :** తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన వల్లకాటి రాజ్ కుమార్ ను మంగళవారం హైదరాబాద్ లోని టీఆర్పీఎస్ భవనంలో మాజీ ఎంపీపీ, మాజీ సొసైటీ చైర్మన్, టీఆర్పీఎస్ నాయకులు బాసాని చంద్ర ప్రకాష్ మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. పద్మశాలి కులస్తుల సంక్షేమానికి పాటుపడాలని, చేనేత కార్మికుల సమస్యల సాధనకు కృషి చేయాలని కోరారు. దీనిపై రాజ్ కుమార్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.తెలంగాణ పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షుడు గోషికే యాదగిరి, నిమ్స్ ఆర్ఎంఓ డాక్టర్ రమేష్, టీఆర్పీఎస్ మాజీ గౌరవ అధ్యక్షుడు వేముల బాలరాజు, మాజీ ప్రధాన కార్యదర్శి అప్పం శ్రీనివాస్, టీఆర్పీఎస్ నాయకులు నవీన్, గాజు శ్రీనివాస్, హరి పాల్గొన్నారు.

# కులగణనపై ముఖ్యమంత్రి స్పందించాలి

### ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్

### ఆమరణ దీక్ష భగ్నం చేసిన పోలీసులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ, కామారెడ్డి డెకరేషన్ లో పొందుపరిచిన సమగ్ర కుల జనగణన చేపట్టి బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని చెప్పి 8 నెలలు దాటినా ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమని, కుల జనగణన బీసీ రిజర్వేషన్లపై ముఖ్యమంత్రి వెంటనే స్పందించాలని ఆలిండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ డిమాండ్ చేశారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలు కోసం గత పది రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న చాపర్తి కుమార్ గాడ్గేకు సంఘీభావంగా మంగళవారం హనుమకొండ జిల్లా కేంద్రం ఏకశిలా పార్క్ ధర్నా చౌక్ వద్ద ఆయన పాల్గొని మాట్లాడారు. గత నెల 25న హైదరాబాదులో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన చాపర్తి కుమార్ గాడ్గే, బత్తుల సిద్దేశ్వరులు, జక్కాని సంజయ్ లను అక్రమంగా అరెస్టు చేసి వారి స్వగ్రామమైన గీసుకొండకు తరలించారు. తన ఇంట్లో దీక్ష కొనసాగిస్తున్న కుమారుని ఆరోగ్యం క్షీణించిందని వరంగల్ ఎంజీఎంలో చేర్పించారు. కుమార్ కు సంఘీభావంగా సోమవారం హనుమకొండ అంబేద్కర్ సెంటర్ నుంచి ఎంజీఎం కు బీసీ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాదయాత్రలో వెళ్లి కుమార్ కు సంఘీభావం తెలిపారు. బీసీ సంఘాల పాదయాత్రని విచిన్నం చేయడం కోసం ఆరోగ్యం క్షీణించిన కుమారుడిని ఎంజీఎం నుంచి పోలీసులు రోడ్డుమీదకు నెట్టివేశారు. అక్కడికి చేరుకున్న సామాజిక, ప్రజాసంఘాల నాయకులు కుమారుని వెంట తీసుకొని హనుమకొండ లోని ఏకశిలా పార్క్ ధర్నా చౌక్ వద్ద దీక్షను కొనసాగించారు. 10వ రోజు ఏకశిలా పార్క్ ధర్నా చౌక్ వద్ద చాపర్తి కుమార్ గాడ్గే కొనసాగుతున్న ఆమరణ నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేసి ప్రజా సంఘాలు అడ్డగించిన పోలీసులు తోసివేసి ఆయనను పోలీసు వాహనంలో తరలించారు. ఆయనను ఎక్కడికి తీసుకు పోయింది సమాచారం ఇవ్వలేదు. పోలీసుల అరెస్టు, ప్రభుత్వ తీరుపై సామాజిక ప్రజాసంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

## సమస్యలు వెంటనే పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాజీపేట మండలం 62, 63వ డివిజన్ ప్రజల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీపీఐ కాజీపేట మండల కార్యదర్శి మునిగాల భిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైఎస్ నగర్ లో మంగళవారం సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం పూర్ణచందర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సీపీఐ మండల కార్యదర్శి మునిగాల భిక్షపతి హాజరై మాట్లాడుతూ 62, 63వ డివిజన్లలో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమైన బురద రోడ్లుగా మారాయన్నారు. ఈ ప్రాంతాలలో వర్షాల కారణంగా దోమలు వృద్ధి చెంది ప్రజల్లో డెంగీ, మలేరియా లాంటి వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి వెంటనే దోమల నివారణ కోసం ఫాంగింగ్ చేయాలని, ట్యాంకర్ల ద్వారా మంచినీటి సౌకర్యం కల్పించాలని కార్పొరేషన్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యురాలు రాసమల్ల దీన పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతన్నాయని, పప్పులు, మంచి నూనెలు, అల్లం, ఎల్లిగడ్డలు ఇతర ఏ వస్తువుల పైన కూడా అధిక జీఎస్టీ మోపుతూ పేద ప్రజలపై భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 6 సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు హనుమకొండలోని అంబేద్కర్ సెంటర్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ధర్నాకు కాజీపేట మండలంలోని అన్ని వర్గాల ప్రజలు సీపీఐ కార్యకర్తలు, సానుభూతిపరులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునిగాల స్వామి, తిరుమల వెంకటేశ్వర్లు, సీపీఐ వైఎస్ఆర్ నగర్ గ్రామ శాఖ కార్యదర్శి జాన పట్ల మంజుల, పోలపల్లి భారతమ్మ, సీవీ విజయ్, లక్ష్మి, ఎల్లస్వామి, రవి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## బెంచ్ ప్రెస్ పోటీలో హమీద్‌కు గోల్డ్ మెడల్




**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** తెలంగాణ రాష్ట్ర స్థాయి బెంచ్ ప్రెస్ (మెన్ అండ్ ఉమెన్) సబ్ జూనియర్, సీనియర్, మాస్టర్స్ పోటీలు హైద్రాబాద్ లోని బలానగర్ రాజు కాలనీ కమిటీ హాల్ లో జరిగాయి. గత నెల 31 నుంచి ఈనెల 2వ తేదీ వరకు నిర్వహించిన పోటీలకు మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం కేంద్రలోని భారత్ వీర్ వ్యాయామశాలలో శిక్షణ పొందిన షేక్ హమీద్ 74 కేజీల విభాగంలో పాల్గొని 107.5 కేజీల బరువును బెంచ్ ప్రస్ చేసి ప్రథమ స్థానం (గోల్డ్ మెడల్) సాధించారు. హమీద్ ప్రస్తుతం ఖమ్మం జిల్లా పోలీస్ శాఖలో ఏఆర్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నారు. అక్టోబర్ నెల 11న గోవాలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నేషనల్ పోటీలో ఎంపికైనందుకు భారత్ వీర్ వ్యాయామశాల కోచ్ మండలోజు సుధాకర్, బుట్టి అశోక్, కృష్ణ, సురేష్, ఠాకూర్ రాజేందర్ సింగ్, రామ్ చందర్, రాంభద్రంలు అభినందించారు.

## ఏసీపీ ప్రశాంత్ రెడ్డికి పరామర్శ



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి తండ్రి పింగిలి జగన్మోహన్ రెడ్డి పది రోజుల క్రితం గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న ప్రముఖ చిత్రకారుడు అంబాల ప్రభాకర్ (ప్రభు) మంగళవారం వారి నివాసానికి వెళ్లి వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇనుగాల సతీష్, మేకల శివ, ఇనుగాల కృష్ణ పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్
సినిమా
మంగళవారం 03, సెప్టెంబర్ 2024




# మహిళలకు ఇది చీకటి కాలం

## చట్టాలను మార్చాలంటున్న అనన్య పాండే

ఇది మహిళలకు చీకటి కాలమని బాలీవుడ్ నటి అనన్యపాండే అన్నారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల గురించి ఆమె తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. గతంతో పోలిస్తే ఇప్పుడు నటీమణులు వారి సమస్యలను ధైర్యంగా చెప్పగలుగుతున్నారని అన్నారు. సమాజంలో జరుగుతున్న ప్రతీ విషయం గురించి మహిళలకు అవగాహన ఉండాలి. ప్రస్తుతం చాలా దారుణమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నాం. ఇది మహిళలకు చీకటి కాలం. ఈ దాడులను ఆపడం కోసం ఏం చేయాలో ఆలోచించాలి. మన చుట్టూ ఉండే పరిసరాలను గమనించుకుంటూ ప్రతి వ్యక్తిపైనా అవగాహన కలిగిఉండాలి. నేను ఇలాంటి పరిస్థితులపై ఎప్పటికప్పుడు చర్చిస్తూనే ఉంటాను. వాస్తవానికి చట్టాలను మార్చాల్సిన సమయం వచ్చింది. ఇది చాలా అవసరమైన నిర్ణయం. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నానని అన్నారు. ఇక ఇదే ఇంటర్వ్యూలో అనన్య 'లైగర్' గురించి ప్రస్తావించారు. సినిమాల్లోని సన్నివేశాలపై హీరోయిన్లు ధైర్యంగా వారి అభిప్రాయాన్ని తెలపాలని అనన్య అన్నారు. 'నాకు ఏదైనా స్క్రిప్ట్ చెప్పినప్పుడు అది బాగా లేదనిపిస్తే.. వెంటనే స్పందిస్తాను. 'లైగర్' స్క్రిప్ట్ చదివిన తర్వాత కొన్ని మార్పులు చెప్పాను. మరికొన్ని సన్నివేశాలు మార్చాలని సూచించాను. ఆ చిత్రబృందం నా సలహాలను పాటించింది. ఎంతో ఆనందంగా అనిపించింది. ఇలా అందరూ చెప్పగలగాలి' అని వివరించారు.







# ఆదిత్య 369 కోసం చిరంజీవి ప్రచారం

బాలకృష్ణతో కలిసి ఓ ఫ్యాక్షన్ మూవీ చేయాలని ఉందని అగ్ర కథానాయకుడు చిరంజీవి తన మనసులోని మాటను వెల్లడించిన సంగతి తెలిసిందే. చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి బాలకృష్ణ 50ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగిన ఈవెంట్‌కు చిరు, వెంకటేశ్ సహా పలువురు నటీనటులు, దర్శకులు హాజరై బాలయ్యకు శుభాకాంక్షలు తెలియజేశారు. 'ఇంద్ర', 'సమరసింహారెడ్డి' పాత్రలతో కథ సిద్ధం చేయాలని చిరంజీవి దర్శకులకు పిలుపునిచ్చారు. మరి అది ఎప్పుడు కార్యరూపం దాలుస్తుందో తెలియదు కానీ, ఒకప్పుడు బాలకృష్ణ సినిమా కోసం చిరు ప్రచారం చేశారు. తండ్రి నట వారసత్వం పుణికి పుచ్చుకున్న బాలకృష్ణ తన సినీ కెరీర్‌లో ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో అద్భుతమైన పాత్రల్లో నటించారు. అలాంటి చిత్రాల్లో 'ఆదిత్య 369' ఒకటి. . ఈ సినిమా ప్రచార కార్యక్రమాల్లో చిరంజీవి పాల్గొని సందడి చేశారు. 'ఆదిత్య 369' రిలీజ్ అయిన తర్వాత మరింత ప్రచారం కల్పించడానికి, పిల్లలను, ఫ్యామిలీ ప్రేక్షకులను ఆకర్షించడానికి నిర్మాత దూరదర్శన్‌లో ప్రకటనలు ప్రసారం చేయాలని ప్లాన్ చేశారు. చిరంజీవితో ప్రచారం చేయిస్తే మంచి ఫలితాలు వస్తాయని భావించి ఆయన్ను రిక్వెస్ట్ చేశారట. నిర్మాత అడగ్గానే వెంటనే ఒప్పుకొన్న చిరంజీవి 'ఆదిత్య 369' సినిమా యాడ్స్‌లో నటించారు. ఈ యాడ్స్ దూరదర్శన్‌లో ప్రసారం అయి ఎక్కువ మంది ప్రేక్షకులు థియేటర్లకు రావడానికి తోడ్పడ్డాయి. బాలకృష్ణ నటన, ఇళయరాజా సంగీతం, సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వ ప్రతిభ, చిరు ప్రచారం సినిమాకు భారీ విజయాన్ని అందించాయి.



# అందాల ఆరబోతలో మాళవిక

మాళవికా మోహనన్ ప్రస్తుతం సౌత్ ఇండియాలో వరుస భారీ సినిమాలతో దూసుకెళుతోంది. 2013లో తన మొదటి సినిమానే దుల్కర్ సల్మాన్ వంటి స్టార్‌తో నటించి వార్తల్లో నిలిచింది. ఆ తర్వాత తమిళంలో రజనీకాంత్ పేట, విజయ్ మాస్టర్, ధనుష్ మారన్ వంటి పెద్ద సినిమాలతో అగ్ర హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. ఇటీవల వచ్చిన విక్రమ్ తంగలాన్ సినిమాలో ఆరతిగా నటించి విమర్శకుల ప్రశంసలు సైతం పొందింది. ప్రస్తుతం ప్రభాస్ రాజాసాబ్ సినిమాతో తెలుగులోనూ ఎంట్రీ ఇవ్వబోతుంది. సుమారు మూడేండ్ల క్రితం ప్రారంభించిన ఈ చిత్రం ఎట్టకేలకు అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకుని సెప్టెంబర్20న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. మాములుగానే బట్టల విషయంలో చాలా పొదుపును పాటిస్తూ.. అంతకుమించి అనేలా అందాలను ఆరబోసే ఈ సొగసరి ఈ యుధ్ర మూవీలో ఓ రేంజ్‌లో రెచ్చిపోయింది. ఇప్పటికే రిలీజైన ట్రైలర్ చూస్తే ఈ విషయం ఇట్టే అర్ధమవుతోంది. అంతేకాదు ఇంటిమేట్ సన్నివేశాలలోనూ శృతిమించి నటించింది. ఈక్రమంలో తాజాగా విడుదల చేసిన సాతియా అంటూ సాగే వీడియో సాంగ్‌లో అమ్మడి గ్లామర్, అందాలు, ముద్దు సీన్లు చూసి ఆమె అభిమానులు, సినీ లవర్స్ షాక్ అవుతున్నారు. గతంలో ఏ మూవీలోనూ మాళవికను ఇంత ఘాటుగా చూసిందిలేదని, మరి ఇంతలా రెచ్చి పోయిందేంటని కామెంట్లు చేస్తున్నారు. ఆ క్లిప్పులను సోషల్ మీడియాలో తెగ షేర్ చేస్తున్నారు.మీరు ఇంతవరకు చూడలేదా ఇప్పుడే చూసి ఎంజాయ్ చేయండి మరి.





# నటన కోసం ఎలాంటి సాహసమైనా చేస్తా

కథ, అందులోని పాత్ర కోసం తమని తాము మార్చుకునే, నటుల్లో విక్రమ్ ఒకరు. అంతేకాదు, కమర్షియల్ కథల కన్నా ప్రయోగాత్మక చిత్రాలకే ఆయన పెద్ద పీట వేస్తారు.అందుకే 'పితామగన్', 'కాశీ', 'అపరిచితుడు',ఐ'వంటి వైవిధ్య చిత్రాలు వచ్చాయి. ఇటీవల 'తంగలాన్'తో మరోసారి తన నట విశ్వరూపాన్ని నిరూపించారు. తాజాగా ఓ ఆంగ్ల మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అనేక ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.2001లో వినయన్ దర్శకత్వంలో వచ్చిన 'కాశీ' మూవీ విక్రమ్‌కు మంచి పేరు తీసుకొచ్చింది. ఇందులో ఆయన అంధుడిగా నటించారు. ఉత్తమ నటుడిగానూ ఫిల్మ్‌ఫేర్ అవార్డును అందుకున్నారు. పాత్ర కోసం విపరీతమైన శారీరక మార్పులకు ప్రయత్నించడం వల్ల కొన్ని సమయాల్లో భయంకరమైన పరిస్థితులను ఎదుర్కొన్నట్లు తెలిపారు. ఈ మూవీ షూటింగ్ రోజులను గుర్తు చేసుకుంటూ 'సినిమాల్లో పాత్రకు అవసరమైనట్లు మారడం, నటించడమంటే నాకు ఇష్టం. ఇతరులతో పోలిస్తే, ఏదైనా ప్రత్యేకంగా చేయాలి. అది అందరూ చేసినట్లు ఉండకూడదు. నేను మందు తాగను, సిగరెట్ కాల్చను. కానీ, సినిమా పట్ల నాకున్న అభిరుచి నాకు విషంలాంటిది. నేను బాగా నటించాలని అనుకున్నప్పుడు అది మరింత ఎక్కువ విషంగా మారుతుంది. నేను 'కాశీ' (తెలుగులో శ్రీను, వాసంతి, లక్ష్మి) అనే మూవీ చేశా. అందులో నటించిన తర్వాత రెండు, మూడు నెలల పాటు నా కంటి చూపు మందగించింది. సరిగా చూడలేకపోయేవాడిని. ఎందుకంటే ఆ మూవీలో అంధుడిగా కనిపించడానికి కళ్లు పైకెత్తి చూడాల్సి వచ్చేది. ఆ ప్రభావం నా కంటి చూపుపై పడింది. మెల్లకన్ను వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరించారు' అంటూ కాశీ మూవీ పూర్తయిన తర్వాత తనకెదురైన పరిస్థితిని గుర్తుచేసుకున్నారు. విక్రమ్ కెరీర్‌లోనే భారీ అంచనాలతో విడుదలైన మూవీ 'ఐ' . శంకర్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం కోసం విక్రమ్ పెద్ద రిస్క్ చేశారట. దాని ఫలితంగా మరిన్ని క్లిష్ట పరిస్థితులు ఎదుర్కోవాల్సి వచ్చేదని, తృటిలో తప్పించుకున్నట్లు తెలిపారు. కర్ణాటకలోని కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ కార్మికుల జీవితాల ఆధారంగా దర్శకుడు పా.రంజిత్ దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'తంగలాన్'. ఈ సినిమా కోసం విక్రమ్ ఎంతగానో శ్రమించారు. మాళవిక మోహనన్, పార్వతి తిరువోతు కీలక పాత్రలు పోషించారు. ఎన్నో అంచనాల మధ్య ఆగస్టు 15న ఇది విడుదలై దక్షిణాదిలో మంచి సక్సెస్ అందుకుంది. ఆగస్టు 30న హిందీలో ఈ సినిమా విడుదలైంది. ఇప్పటివరకూ ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్లకు పైగా వసూలుచేసింది.

# బాలల సంక్షేమ సమితిలో ఊసరవెల్లులు

**ప్రభుత్వ ఆదాయానికి రూ.25 లక్షల గండి**

**ఒకవైపు విజిలెన్స్ విచారణ**
**మరొకవైపు శాఖాపరమైన విచారణ**




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మిషన్ వాత్సల్య మార్గదర్శకాల ప్రకారం బాలల సంక్షేమ సమితికి ప్రతి నెల 20 సిట్టింగులకు మించకుండా నిర్వహించే వెసలుబాటు భారత ప్రభుత్వం కల్పించింది. కానీ అందుకు విరుద్ధంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కొన్ని జిల్లాల సీడబ్ల్యూసీలు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నాయి. హనుమకొండలో పూర్తిస్థాయిలో పనిచేస్తున్న సమితిని భూపాలపల్లి జిల్లాకు కూడా పనిచేయాల్సిందిగా అదనపు బాధ్యతలు ఇచ్చిన విషయం అందరికి విధితమే. గతంలో భూపాలపల్లి జిల్లాలో సిట్టింగులకు హాజరు కాకుండా సదరు కమిటీ ఇష్టారాజ్యంగా హాజరు నమోదు చేసుకొని లక్షల రూపాయలు అక్రమార్జన చేసిన విషయం కూడా విధితమే. ఇది వెలుగులోకి వచ్చిన తర్వాత సదరు కమిటీ భూపాలపల్లికి భౌతికంగా రాకుండా కేవలం చరవాణి ద్వారా మాత్రమే పిల్లలకు సంబంధించిన ఆర్డర్లను పాస్ చేస్తూ వీటిని సిటింగులుగా పరిగణిస్తూ పెద్ద మొత్తంలో ఫీజులను దండుకున్నారు. ఈ విధానం వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడిందని ఆర్థికవేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ క్రమంలో తెలంగాణ విజిలెన్స్ వారి ఆర్. సి. నెంబరు:42/ ఆర్ఈవిఓ/ డబ్ల్యూ/ 24-1, తేదీ:23.01.2024 ప్రకారం విచారణ సైతం కొనసాగుతుందని, అంతేకాకుండా శాఖా పరమైన విచారణ లేఖ సంఖ్య:922/ఏంవి/ 2023 తేదీ:15.04.24 కూడా జరుగుతుందని విశ్వసనీయ వర్గాల సమాచారం. అయితే ఈ అదనపు సిట్టింగ్ ఫీజుల మొత్తం రూ.25 లక్షలకు తగ్గకుండా ఉంటుందని నిఘాటీం ద్వారా తెలిసింది. కాబట్టి అదనపు సిట్టింగ్ డబ్బులను రికవరీ చేయకుండా, సదరు బాలల సంక్షేమ సమితికి ప్రస్తుత ఫీజులను ఇవ్వడం సరికాదనే వాదన ఉంది. ఈ సభ్యులు పిల్లల సంక్షేమాన్ని మరిచి వారి స్వలాభం కోసం అందిన గాడికి దండుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు అనేది జగమెరిగిన సత్యం. ఈ విధంగా పేద పిల్లల సంక్షేమం కోసం వెచ్చించిన నిధులను వాడుకున్న వీరికి అనాథ పిల్లల ఉసురు తగులుతుందని పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం ఇలా ఉండగా తెలంగాణలోని ఒక జిల్లా సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ తను అదనంగా సిట్టింగులు చేశానని వాటికి చార్జీలు ఇవ్వాల్సిందిగా డైరెక్టర్ ను కోరగా మిషన్ వాత్సల్య మార్గదర్శకాల ప్రకారం నెలకు 20 సిట్టింగ్ చార్జీల కన్నా ఎక్కువ ఇవ్వడం ఎంత మాత్రం కుదరదని సమాధానం ఇవ్వడం కొస మెరుపు.

# అవయవదానంతో పునర్జన్మ

**సదాశయ ఫౌండేషన్ అధ్యక్షులు శ్రవణ్ కుమార్**




**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** అవయవదానంతో పునర్జన్మ లభిస్తుందని సదాశయ ఫౌండేషన్ అధ్యక్షులు టి.శ్రవణ్ కుమార్ అన్నారు. ఏవీవీ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్, సదాశయ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం అవయవ దానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కొడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించి ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భుజంగారెడ్డి అధ్యక్షత వహించారు. సదాశయ ఫౌండేషన్ అధ్యక్షులు శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా నేత్రదానం యొక్క ప్రాముఖ్యత, అవసరాన్ని విద్యార్థులకు తెలియజేశారు. అలాగే అవయవదానం ఎప్పుడూ, ఎవరు, ఎలా చేయాలి? దాని వల్ల ఉపయోగాలను సవివరంగా వాలంటీర్లకు తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భుజంగారెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ అవదానంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కొడిమాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏవీవీ కళాశాల రక్తదానంలో, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంలో ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఇప్పటినుంచే నేత్రదానం, అవయవదానాలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించడంతోపాటు పాటు వారిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జాతీయ అవార్డు గ్రహీత మండల పరిశరాములు, జన విజ్ఞాన వేదిక హనుమకొండ అధ్యక్షులు వి.శ్రీనివాస్, అధ్యాపకులు డాక్టర్ ఎస్.అనిత, వాలంటీర్లు పాల్గొన్నారు.

# విశ్వకర్మ యోజన పథకం పోర్టల్ పునరుద్ధరించాలి

**అదనపు కలెక్టర్ సంధ్యారాణికి వినతి**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** దేశ వ్యాప్తంగా ఉన్నటువంటి పేద కుటుంబాలకు ఆసరాగా నిలిచేందుకు ప్రధానమంత్రి 17 సెప్టెంబర్ 2023 న న్యూ ఢిల్లీలో విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రారంభించినా రాష్ట్రంలో సాంకేతిక లోపంతో అమలుకు నోచుకోవడంలేదని, దానిని వెంటనే పునరుద్ధరించాలని భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి ఆడెపు వెంకటేష్ కోరారు. ఈ మేరకు మంగళవారం వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణిని కలిసి సమస్యలను వివరించడంతోపాటు దానిని అమలులోకి తేవాలని కోరారు. 18 కులాలకు సంబందించిన విశ్వకర్మ యోజన పథకం ఎంతోమందికి ఆసరాగా నిలుస్తుందన్నారు. వరంగల్ జిల్లాలో ఎంతో మంది అర్హులు ఉన్నప్పటికీ సాంకేతిక లోపం వల్ల వారు లబ్ది పొందలేకపోతున్నారని వెంకటేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన వినతి పత్రం పరిశీలించి త్వరలోనే సమస్యను పరిష్కారించే విధంగా సంబంధిత శాఖలతో మాట్లాడి..విశ్వకర్మ యోజన పథకం పోర్టల్ ను త్వరలోనే అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. దీనిపై అదనపు కలెక్టర్ సానుకాలంగా స్పందించినట్లు వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో 36 డివిజన్ బీజేపీ నాయకులు ఆకారపు శేఖర్, తాటికొండ వెంకటేశ్వర్లు, గారే శ్రీనివాస్, ఆకారపు ఈశ్వర్, మాటోజు రవి, నరసింహ చారి, రాజు, కృష్ణ, వడ్రంగి పని చేసేవారు పాల్గొన్నారు.

# శభాష్ డోర్నకల్



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** డోర్నకల్ రైల్వే జంక్షన్‌లో ఎలాంటి అవరోదాలు ఏర్పడినప్పటికీ ఆపన్న హస్తాలు అందించేందుకు డోర్నకల్ పట్టణ ప్రజలు ముందుంటున్నారు. ఎవ్వరి అహ్వానం అవసరం లేకుండానే అనేక రకాల సహాయ, సహకారాలు అందించే సమయం కోసం ఎదురు చూస్తుంటారు. గత మూడు రోజులు క్రితం కురిసిన భారీ వర్షానికి ఈ స్టేషన్‌లో నాలుగు రైలు నిలిచిపోవటంతో దాదాపు రెండు వేల మంది ప్రయాణికులు దిక్కులేని వారిగా మిగిలారు. దీంతో స్పందించిన పట్టణ ప్రజలకు వారికి అల్పహారం, భోజనం, తాగు నీరు, టీలు అందించి శభాష్ డోర్నకల్ అంటూ గ్రీన్ మార్క్ అందుకున్నారు. కానీ ఈ ప్రాంత ప్రజలకు సెంట్రల్‌లో ఉన్న రెడ్ మార్క్ వెంటాడుతోంది. గత రెండు రోజులుగా పట్టణ వృద్దుల రెడ్ మార్క్ సంఘటణ, వాటి చాయలను గుర్తు చేసుకుంటు రైల్వే బోర్డులో ఇంక 'రెడ్ మార్కు' ఉంటే తొలిగించాలని విన్నవిస్తున్నారు. అప్పటి విశయాలను వారి మాటల్లోనే మీ ముందు ఉంచుతున్నాం..

అది 1970-80 సంవత్సరంలోని కాలం.. ఓ హెూలీ పండుగ నాడు పట్టణ ప్రజలు హెూలీ సంబరాలు జరుపుకుంటున్నారు..ఎమ్మెల్యేగా రామసహాయం సురేందర్ రెడ్డి భాధ్యతలు నిర్వహిస్తుండగా పట్టణంలో కాంగ్రెస్ నాయకులు నందులాల్ జైన్, గండి సత్యనారాయణ ముఖ్య నాయకులుగా బాధ్యతలు పోషిస్తున్న సమయంలో కాంగ్రెస్ రెండు వర్గాలుగా విడిపోయి ఉంది. రాజకీయ నాయకుల మధ్య తీవ్రమైన పోరు కొనసాగుతోంది. ఇదే సమయంలో వచ్చిన హెూలీ పండుగ డోర్నకల్ పట్టణానికి చేదు గుర్తుగా



నిలిచిపోయింది. నందులాల్ జైన్, హరికృష్ణ లడ్డా, ఠాకూర్ సత్యనారాయణ సింగ్ (టాంకు), బంకట్ సింగ్ హెూలీ ఉత్సవాలకు నాయకత్వం వహించారు. వీరు ఉత్తరాది సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో హెూలీని అత్యంత ఘనంగా జరుపుకుంటున్నారు. అదే రోజు ఓ మిలిటరీ రైలు దూర ప్రాంతానికి వెళుతూ డోర్నకల్ రైల్వేస్టేషన్ లో ఆగింది. పట్టణంలోని దుఖాణాల్లో ఉల్లిగడ్డలు, ఆలుగడ్డలు, చింతపండు, పప్పులాంటి సామాగ్రి మిలిటరీ జవానులు కొనుగోలు చేస్తున్నారు. వాళ్ళందరూ మిలటరీ డ్రెస్ లో ఉన్నారు. అయితే వారందరిదీ ఉత్తరాది కావడంతో పట్టణంలోని ఓ ప్రముఖ వ్యక్తి (టాం.) మిలటరీ కమాండర్ కు రంగుపూసే ప్రయత్నం చేశారు. దీనికి ఆయన డ్రెస్ పైన డ్యూటీలో ఉన్నాను అంటూ ససేమీరా అన్నారు. దేశ రక్షణ కోసం ఉన్న మీరు మాతోపాటు సంతోషాలు పంచుకోవాలని ఆయనకు రంగు పూశారు. కోపాద్రికుడైన ఆయన రంగు పూసిన వ్యక్తి చెంపపై కొట్టాడు. ఇది గమనించిన స్థానికులు మిలిటరీతో వాగ్వాదానికి దిగి దాడికి యత్నించారు. దీనికి ప్రతిదాడిగా స్టేషన్ లో ఉన్న రాళ్లతో మిలటరీ జవానులు ఎదురుదాడి చేశారు. ఇలా మిలటరీ, పట్టణ వాసులు పరస్పరంగా రాళ్ల దాడి చేసుకున్నారు. ఈ విశయాన్ని ట్రంక్ కాల్ ద్వార తెలుసుకున్న కేంద్ర ప్రభుత్వం మిలిటరీ జవానులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించింది. సీరియస్‌గా తీసుకుంది. కేసులు నమోదు చేసింది. ఇది జరిగిన సంవత్సరం కాలం తర్వాత పట్టణానికి చెందిన ఓ మహిళను ఆదిలాబాద్ జిల్లా ఖానాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో వివాహం జరిపించారు. వివాహం అనంతరం తొలిసారిగా అమ్మగారింటికి వచ్చి తిరిగి పూరి ప్యాసెంజర్ ట్రెన్ లో వెళ్లేందుకు వారి అన్నదాముల కలిసి స్టేషన్ చేరుకున్నారు. కాగా మహిళను చూసి రైల్వేస్టేషన్ లో ఆగి ఉన్న మిలిటరీలోని ఓ వ్యక్తి కామెంట్ చేశారు. ఇది విన్న మహిళ అన్నదమ్ములు ముగ్గురు మిలిటరీ రైల్వే స్టేషన్ లో ఉన్న వాక్యూం పైపులతో దాడి చేసి తీవ్రంగా కొట్టారు. ఈ విషయం కూడా కంట్రోల్ మెసేజ్ ద్వారా తెలుసుకున్న కేంద్ర ప్రభుత్వం డోర్నకల్ లో డెకైట్స్ ఉన్నారంటూ వ్యాఖ్యానించింది. డోర్నకల్ ను సమస్యాత్మక ప్రదేశంగా ప్రకటించి రెడ్ మార్క్ పెట్టింది. కానీ నేడు జరుగుతున్న ప్రకృతి విపత్తులు కారణంగా రైల్వే స్టేషన్ లో ట్రెన్స్ ఆగిపోతే సికింద్రాబాద్ డివిజన్ లోనే ప్రప్రదమంగా ప్రయాణికులను ఆదుకునేది డోర్నకల్ పట్టణ ప్రజలే... దీనికి అనేక ఉదాహరణలు ఉన్నాయి.. గత రెండు రోజుల క్రితం అల్పాహారం, భోజనం, నీటిని అందించి ఆదుకున్నారు. పట్టణానికి చెందిన యువకులు, జైన, మహేశ్వరి, వైశ్య, ముస్లిం సంఘాలకు చెందిన నాయకులు.. జిల్లా పరిషత్ పాఠశాల హిందీ ఉపాధ్యాయులు అనిత, కూతురు సంజన, న్యాయవాది తేజావత్ రమేష్, 6వ వార్డు కౌన్సిలర్ తేజావత్ సంధ్యలు ముందుకు వచ్చి అల్పాహారాన్ని భోజనాలను అందించారు. ఇలా రైలు ప్రయాణికులకు ఏమైనా ఇబ్బందులు జరిగితే ఈ డోర్నకల్ ప్రజలు ముందుంటారని చెప్పడంలో సందేహం లేదు. ఇలా గత కొన్ని సంవత్సరాలుగా రైల్వే ప్రయాణికులకు అత్యవసర సహాయం అందిస్తున్న ఇతర ప్రాంత ప్రజలతో 'వెల్డన్', 'థాంక్యూ డోర్నకల్' అనిపించుకుంటున్నా ఇక్కడి ప్రజల సేవను గుర్తించి డోర్నకల్‌కు రెడ్ మార్క్ ఉంటే తొలగించాల్సిందిగా ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com